# పునాదులు కూలుతున్నాయి

ఎ. రవీంద్రబాబు



'పునాదులుకూలుతున్నాయ్' సార్ అన్న మాటలు నాకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఎంత ప్రయత్నించినా నిద్రకు మనసు సిద్ధం కావడం లేదు. ఆలోచనలు... ఏవేవో ఆలోచనలు... ఎన్నెన్నో ఆలోచనలు.... నిజంగానే పునాదులు కూలుతున్నాయా? మరి మనిషి అస్తిత్వం వేటి పైన నిలబడుతుంది? ఎంతకాలం నిలబడుతుంది? మనుషులు ఉనికిని కోల్పోయిన తర్వాత సాధించేదేమిటి? సాధించే దానిని... సాధించిన దానిని అభివృద్ధి అందామా? మరి అభివృద్ధికి నిర్వచనం దేనిని ప్రమాణంగా తీసుకొని ఇవ్వాలి? ప్రశ్నలు... ప్రశ్నలు.... ప్రశ్నలు... మనసును దెయ్యాల్లా పీక్కుతినే ప్రశ్నలు.

జీవితానికి అనుకరణే పునాదా? అసలు ఏ సంస్కృతైనా అనుకరణకు లోనుకాకుండా ఉంటుందా? ఉండదు.. నిజంగా ఉండదు. మరి మూలాలు కోల్పోయే విధంగా తయారైతే...!? అసలు అనుకరణ వలన మనం కోల్పోతున్నదేదో తెలియాలి కదా!! మన సౌలభ్యాన్ని మనం అంచనా వేసుకోవాలి కదా...!!? మనం మనంగా జీవిస్తున్నామా!? పిచ్చి ప్రశ్న... చావు ప్రశ్న...

మనం మనలా కాకుండా ఎలా జీవిస్తున్నాం...!?

ప్రశ్నలు... ఆలోచించడం... ఆలోచనల్లో ప్రశ్నలు...

జీవితంలో ప్రశ్నలు... జీవితాన్ని ప్రశ్నించే ప్రశ్నలు...

నాన్న కంప్యూటర్ ఇంజనీరు. నెలకు ఇరవై రెండువేల జీతం. అమ్మ ఓ ప్రైవేటు కంపెనీలో రిసెప్షనిస్టు. నెలకు ఎనిమిది వేల వరకూ వస్తుంది. ఇప్పుడున్న అపార్ట్‌మెంట్ కొనుక్కొని ఆరు సంవత్సరాలు అవుతుంది. చెల్లి బి.టెక్ చదువుతుంది. దానికి ఎప్పుడూ ఫ్రెండ్స్ గొడవే. వాళ్లతోనే కాలక్షేపం. కాలేజీ నుండి ఇంటికి రావడమే ఆలస్యం మరలా ఫోన్లు... హడావుడిగా ఉంటుంది. ఖాళీ దొరికితే కంప్యూటర్ ముందు కూర్చొంటుంది. చాటింగ్... ఇంటర్నెట్ ఫ్రెండ్స్... నా గురించి కంటే కంప్యూటర్ గురించే దానికి ఎక్కువ తెలుసు. ఇంట్లో ఇష్టం లేకపోయినా నా ఇంట్రెస్ట్ కొద్దీ ఎం.ఎ. సోషియాలజీ తీసుకున్నాను.

''ఏం? సమాజాన్ని ఉద్ధరిద్దామనా....? నీతోటి వాళ్లందరూ ఎం.సి.ఎ చేస్తుంటే..!? బోడి సోషియాలజీ చదివి ఏం చేద్దామని?! నాన్న అరుపులు ఇప్పటికీ నా చెవుల్లో వినిపిస్తూనే ఉంటాయి.

బి.యస్.సి కంప్యూటర్ అయిన తర్వాత నేను సోషియాలజి చదవడానికి ఇంట్లో పెద్ద రభసే అయ్యింది. నాన్న వాళ్ల ఫ్రెండ్స్‌తో కూడా చెప్పించాడు నా ఆలోచనలు మార్చడానికి. చివరకు తన వల్ల కాదని మానుకున్నాడు.

ఉదయాన్నే ఆరు గంటలకు పనిమనిషి వచ్చి తలుపు తట్టి నిద్రలేపుతుంది. మేము నిద్రలేచి అమ్మ ముఖం కంటే పనిమనిషి ముఖమే ఎక్కువ సార్లు చూస్తాం. 'బెడ్ కాఫీలు, బాత్‌రూం పనులు అయ్యేసరికి పనిమనిషి టిఫిన్ టేబుల్‌పై సిద్ధంగా ఉంచుతుంది. తినేసి ఒకరికి ఒకరం 'బాయ్' చెప్పుకుంటూ లంచ్ బాక్స్‌లతో తొమ్మిది గంటలకల్లా ఇంట్లో నుండి బయటపడతాం.

అమ్మా, నాన్న ఆఫీసు నుండి వచ్చేది సాయంత్రం ఆరుగంటలకు... కానీ టయానికి ఎప్పుడూ రారు. పార్టీలనీ, ఫంక్షన్లనీ ఎనిమిదీ–తొమ్మిది గంటలకు వస్తారు. నేను, చెల్లెలు కూడా ఎట్లా ఇంట్లో బోర్ అని ఆలస్యంగానే వస్తాం. పని మనిషి మాత్రం అన్నీ వండిపెట్టి ఆరుగంటలకల్లా ఎవరొచ్చినా రాకపోయినా లాక్ చేసి వెళ్లిపోతుంది. అంతనమ్మకమైన పనిమనిషి దొరకటం అదృష్టమనే చెప్పాలి.

నేను ఇంట్లో వాళ్లకంటే ఇతరులతోనే ఎక్కువ టైం గడుపుతాను. నేనే కాదు... మా ఇంట్లో అందరూ అంతే. ఒకరికి సమయం ఉన్నప్పుడు ఇంకొకరికి కుదరదు. ఆదివారం వచ్చినా...! నాన్న పని మిగిలిపోయిందని కంప్యూటర్ ముందే కూర్చుంటాడు. చెల్లైతే ఫ్రెండ్స్‌తో సినిమాకో, పిక్నిక్కో వెళ్లిపోతుంది. అమ్మ ఇంట్లో పనుల్లో మునిగిపోతుంది. లేకపోతే ఆదివారం కదా ఫ్రీ అని అమ్మ ఫ్రెండ్స్ రావడమో! అమ్మే వాళ్ల స్నేహితులింటికి వెళ్లడమో జరుగుతుంది. ఒక్కోసారి ఆదివారం కంటే విడిరోజులే నయం అనిపిస్తుంది.

బయటనుండి వచ్చి, మనసుకు విసుగు పుట్టి ఎప్పుడైనా మా ఇంటి కిటికీలు తెరిస్తే చాలు... కదులుతున్న వాహనాలతో నిండిన రోడ్డు... విపరీతమైన సైరన్ శబ్దాలతో మనసు బరువు ఎక్కువే అవుతుంది తప్ప తగ్గదు. కారిడార్‌లో నిలబడి ఆకాశాన్ని చూస్తే పై అపార్ట్‌మెంట్ వాళ్లు ఆరేసిన బట్టలే ఆకాశం కంటే బాగా కనిపిస్తాయి. ఇక్కడకొచ్చి ఇంతకాలమైన పక్క పోర్షన్లో ఉన్న వాళ్లతో మా పరిచయం 'హాయ్... బాయ్' వరకే. ఎవరి గురించి ఎవరం పట్టించుకోం. పట్టించుకునేంతగా పలకరించుకోవడమే లేదు.

ఆలోచనలు ... ఇలాంటి ఆలోచనలు... మనుషులతో సంబంధాలు తెగుతున్న ఆలోచనలు... నిద్రకు దూరం చేస్తున్న ఆలోచనలు...

''నువ్వు మాత్రం మీ మేనేజర్‌తో చనువు కొద్దిగా తగ్గించుకుంటే మంచిది'' బెడ్‌రూంలో నుంచి నాన్న గొంతు.

వాళ్ల బెడ్‌రూంలో ఎంతసేపటి నుండి అమ్మానాన్న వాదులాడుకుంటున్నారా..!? నా ఆలోచనల్లోనే నే ఉన్నా కదా...

''వాడా... ఆ శ్రీరామా... నిన్న రెస్టారెంట్లో చూశారా మమ్మల్ని?'' అమ్మగొంతు.

''ఎక్కడ చూశానా అన్నది కాదు''

''అమాయకుడు... నవ్వుతూ... సరదాగా మాట్లాడితే చాలు...'' అమ్మ కాజువల్‌గా మాట్లాడుతుంది.

''అదే... ఆ నవ్వులు... ఆ సరదా కబుర్లే... ఆ తర్వాత...?! అందుకే వద్దు''

''వచ్చే నెల నుండి నా జీతం పదివేలు చేస్తానంటున్నాడు'' అమ్మ గొంతులో సంతోషం ఉంది.

''అయినా... వాడితో నువ్వు తిరగడం నాకు ఇష్టంలేదు...!'' తెగేసినట్లు చెబుతున్నాడు నాన్న.



## బిజినెస్ గర్ల్

'**క్యోం**కి సాస్ భీ, కభీ బహూథీ' సీరియల్‌తో పేరుగాంచిన ఆశ్లేష బోటిక్‌ని ప్రారంభించబోతోంది. టీ'ఎన్ని సీరియల్స్‌లో నటిస్తే మాత్రం ఏం లాభం చెప్పండి. పక్కన ఏదో ఒక వ్యాపారముంటేనే ఫైనాన్షియల్‌గా 'సేఫ్‌సైడ్'' అంటోంది. సందీప్ అనే నటుడ్ని ఈ అమ్మాయి లవ్ చేస్తోందని అంటున్నారు. సహజంగానే వీటన్నిటిని ఆశ్లేష ఖండిస్తోంది.

''నువ్వు మాత్రం, మీ అసిస్టెంట్ లీనాను కార్లో కూర్చోపెట్టుకొని సినిమాకు తిరగొచ్చా....?''

''అయితే నే తిరుగుతున్నానని... నువ్వూ తిరుగుతున్నావా?''

''అలా అని నువ్వు అనుకుంటే నేను ఏమీ చేయలేను... నా మీద నీకు, నీమీద నాకు నమ్మకం ఉందనుకొంటాను'' అమ్మగొంతు ఆవేశంగా ఉంది.

''ఉన్నదనే మాట్లాడుతున్నాను.''

''ఉన్నప్పుడు ఇలాంటి విషయాలు మాట్లాడొద్దు'' అమ్మగొంతు కటువుగా, కాఠిన్యంగా ఉంది.

వాళ్ల బెడ్‌రూం నుంచి వినిపిస్తున్నమాటలు... నిజానికవి మాటలుకావు... రెండు జీవితాలకు... ఒక కుటుంబ చట్రానికి సంబంధించిన మూలాలను ఛేదించే ఖడ్గాలు. ఇంకా వాళ్ల మాటలు వినాలంటే...?! ఎందుకో అసహ్యం వేసింది... నామీద నాకే అసహ్యం వేసింది...అమ్మ... నాన్న... రక్తసంబంధం... పేగు తెంచుకున్న బంధం... ఏవో నాలో ఉన్న కొన్ని సున్నిత భావాలను నానుండి బలవంతంగా దూరం చేస్తున్న ఫీలింగ్... ఆ మాటలు వినపడకుండా ఉండి ఉంటే...!?

ఆలోచనలు... ఏవేవో ఆలోచనలు... అసలు అమ్మ అలా ఎందుకు ఉండాలి? నాన్న అలా!?! ఆపై ఊహించడమే కష్టమైపోయింది... ఏదీ నిజం కాకూడదు... అబద్ధమే అవ్వాలి.

ఇక సుఖం లేదు... ఈ ఆలోచనల్ని ఆపి నిద్రపోవాలి. పక్కకు తిరిగి, కాళ్లు ముడుచుకొని, దుప్పటి పూర్తిగా కప్పుకున్నాను. మరలా దుప్పటి ముఖం మీద నుండి తీశాను. రెండో వైపు తిరిగి పడుకున్నా. ఊ... హూ.. నిద్ర రావడంలేదు. ఎందుకిలా అయింది ఈ రోజు...!! అమ్మా నాన్నకు నిద్రపట్టిందేమో...!! మాటలు వినపడటం ఆగిపోయాయి. నా మనసుకు కొంతలో కొంత ఊరట కలిగింది.

ఒకసారి పైకి చూశాను... ఫ్యాను... నిశ్శబ్దంగా తిరుగుతుంది.

అమ్మ డిగ్రీ వరకూ చదివింది. అన్ని విధాల బాగా కలిగిన కుటుంబం. ఐదు లక్షల కట్నం ఇచ్చి పెళ్లి చేశారు. వెంటనే హైదరాబాద్ వచ్చి కాపురం పెట్టారట. అప్పట్లో నాన్నకు తొమ్మిది వేల వరకూ జీతం వస్తుంటే చాలదని తెలిసిన అమ్మ నాన్నను బలవంతం చేసి మరీ ఉద్యోగంలో చేరిందట. అమ్మదీ సర్దుకుపోయే మనస్తత్వం కాదు నాన్న లాగే... అలాగని అత్యాశాకాదు... హై క్లాస్‌గా జీవించాలనుకుంటారు ఇద్దరూ...

నాన్న కారు కొనాలని అమ్మ ఎంత ఫోర్స్ చేసిందో....!? చివరకు లోన్ తీసుకుని కొన్నారు. కారు కొన్న రోజు అమ్మా నాన్న ముఖాలలో ఆనందం ఇంతని చెప్పలేను. ఆ ఆనందం వెనుక మా అపార్ట్‌మెంట్స్‌లో కారుకొన్న మూడో ఫ్యామిలీ మేమే అనే భావం కూడా ఉంది. అదే విధంగా మేమూ కారుకొన్నాం అని పదిమందికి తెలిసేలా హోటల్లో పార్టీకూడా అరేంజ్ చేశారు.

అమ్మ ఉద్యోగంలో చేరడం.... మానివేయడం... మరలా చేరడం... మరలా మానివేయడం... మరో కొత్త కంపెనీలో జాబ్ చేరడం.... అక్కడా ఇలానే... ఇప్పుడు పని చేస్తున్న కంపెనీలో చేరి నాలుగు నెలలే అవుతుంది. ఇంతలో అమ్మా, నాన్న మధ్య ఈ రాత్రి ఇలా...!!?

''నీవల్లే ఇన్ని ఉద్యోగాలు మానెయ్యడం'' అని అమ్మ మేమందరం ఉన్నప్పుడు నాన్నపై చిరాకు పడటం నాకుతెలుసు. కానీ... కారణాలు పూర్తిగా తెలియవు. నే అలా ఆలోచించనూ లేదూ... ఆలోచించాలంటే...!! భయం... అసహ్యం...

అమ్మా, నాన్న ప్రేమాభిమానాలతో జీవిస్తున్నారా? ఒకటిరిపై ఒకరు నమ్మకాలు కోల్పోతూ జీవిస్తున్నారా...!? ఒక కొడుగ్గా ఇలాంటి ప్రశ్నలు వేసుకొంటున్నందుకు....!? వేసుకోవాల్సి వచ్చినందకు... ఇలాంటి పరిస్థితి ఎదురైనందుకు...!? ఏమో...!? ఇంతకు మించి ఎక్కువ ఏమీ ఆలోచించలేను...! మాట్లాడలేను...అమ్మ గురించి...!! నాన్న గురించి...!?

నిద్ర మాత్రం రావడం లేదు... ఆలోచనలు... దాహం వేస్తుంది. గొంతులో ఏదోలా ఉంది...! చిరాగ్గా దుప్పటి తీశాను. ఫ్రిజ్‌లో వాటర్ తెచ్చుకుని తాగాను. ఆ చల్లదనానికి శరీరం చల్లబడిందేమో కాని మనసు మాత్రం చల్లబడలేదు. పక్క బెడ్ మీద చెల్లెలు కొద్దిగా కదిలి పక్కకు తిరిగి పడుకుంది.

సార్ అన్న మాటలకూ... మా జీవితాలకూ సంబంధం ఉందా... ఆ సంబంధమే నన్ను నిద్రపోకుండా చేస్తుందా...!? పైన ఫ్యాను మాత్రం శబ్దం చేయకుండా తిరుగుతుంది.... తిరుగుతూ ఉంది.

***

సాయంత్రం క్లాస్ జరుగుతున్నప్పుడు.... స్టడీ ఇండియా ప్రోగ్రాం వారి కల్చరల్ కార్యక్రమాలు ఉన్నాయని నోటీస్ వచ్చింది. మనదేశం సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకునేందుకు అమెరికా నుండి పదిహేను మంది స్టూడెంట్స్ వచ్చారు. వాళ్ల ప్రోగ్రాం పూర్తి అయినట్లు ఉంది. వెళ్లేముందు వాళ్లు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం మా యూనివర్శిటీలో అలవాటే...

క్లాసులు అయిపోగానే నేను, శీను, అరుణ ఆడిటోరియానికి వెళ్లాం. మేం వెళ్లే సరికే ప్రోగ్రాం స్టార్ట్ అయింది. హాలంతా నిశ్శబ్దంగా ఉంది. ఖాళీ సీట్లు వెతుక్కొని కూర్చున్నాం. స్టేజీపైన 'భారతీయ సాంస్కృతిక అధ్యయనం' అని బానర్‌కట్టి ఉంది. పట్టు చీరతో ఒకామె 'గజానన ప్రార్థనకి' నాట్యం చేస్తోంది. ఆమె నాట్య భంగిమలు మమ్మల్ని నిజంగా ఆశ్చర్యానికి గురి చేశాయి. ఎంత కష్టపడి నేర్చుకుందో మరి. తర్వాత అత్త, మామ, భార్య, భర్త, బావ, మరదలు, పిల్లలు మొత్తం తొమ్మిది క్యారక్టర్లు ఉన్న స్కిట్ ఒకటి వేశారు. ఉమ్మడి కుటుంబం.. వారి మధ్య ఉన్న సంబంధాలను చక్కగా చూపించారు. వాచకం... అభినయం బాగా ఉన్నాయనిపించింది.

తర్వాత జానపదగీతాన్ని నృత్యం చేస్తూ ప్రదర్శించారు. వారి కట్టు బొట్టు చాలా బాగుంది. కరతాళ ధ్వనులతో ప్రదర్శన ముగియగానే ... గ్రామాలు తిరిగి వాళ్లు తీసిన డాక్యుమెంటరీ ప్రదర్శిస్తారని అనౌన్స్ చేశారు.

లైట్లన్నీ ఆరిపోయాయి... వెనకనుండి తెరపై ఫోకస్ పడింది.

అదొక పల్లెటూరు... ఇంకా ఆధునిక నాగరికత



సోకని పల్లెలా ఉంది. మట్టి రోడ్డు... పూరిల్లు.. గుడిసెలు... ఐదుగురు పిల్లలు గోలీలాట ఆడుకుంటున్నారు. ఊరిపేరు... ఆటపేరు. ఆట ఆడే విధానం మాకు వినిపిస్తున్నాయి. తర్వాత బొంగరాలాట.... ఆడుతున్న వారు... ఆట గురించి చెప్పడం... చిత్రించారు.

పొలాలు... గడ్డి మేస్తున్న పశువులు.. ఆ పశువుల్ని తోలుకెళ్లిన పిల్లలు... చెట్టుకింద చేరి కోతికొమ్మచ్చి ఆడుకుంటున్నారు. పక్కన ఇంకొంత మంది పిల్లలు కర్రాబిళ్ళ ఆడుకుంటున్నారు.

తర్వాత ఒక పూరి గుడెసెను చూయించారు. ఉదయాన్నే తీసినట్లుంది. గుడిసె ముందు ఒకామె చిమ్మి పేడకల్లాపి చల్లి ముగ్గులు పెట్టింది. మట్టి గోడకు సున్నం వేసి ఉంది. గోడకు, ఇంటి వాకిలికి ఇరువైపు ఉన్న అరుగులకు ఒకలైన్ ప్రకారం ఎర్రమట్టి గుడ్డతో అద్దుతోంది. పేడతో ఇల్లు అలకటం, పిండి ముగ్గులు వేయడం మొదలైనవన్నీ చూపించారు. అదంతా పండుగకు ఇల్లు అలంరించుకోవడమని... మాటల ద్వారా అర్థమయ్యేలా చెప్పారు.

''ఇక్కడ బావుంది... బాగా లేదు... అని కాదు.. ఎక్కడో అమెరికాలో పుట్టి పెరిగిన వాళ్ళు మన సాంస్కృతిక అంశాలను మనకు చూపిస్తుంటే..!?! మనం చూడడం ఎంత విడ్డూరం?''

ఇంకొక ఇంట్లో స్త్రీ కర్రల పొయ్యి మీద వంట చేస్తోంది. పొయ్యికి ఒక వైపు పెద్ద మట్టి బాన ఉంది. దాన్ని పొంత అంటారట. వంటపూర్తి అయ్యేసరికి అందులో నీళ్లు వేడి అవుతాయట... స్నానానికి ఉపయోగించుకుంటారట. సారె... దానిపై కుండలు చేయడం చూపించారు. బహుశా అది కుమ్మరి వాళ్ల ఇల్లేమో అనుకున్నాను.

మగ్గం.... దానిపై బట్టలు నేయడం, ఇలా వివిధ కులాలు, వృత్తులు... ఆచారాలు చూపించారు. సుమారు గంట డాక్యుమెంటరీ అది. శీను, అరుణ మాత్రం నాకు అది తెలుసు... ఇది తెలుసు అని చెప్తున్నారు మధ్యలో. బహుశా పుట్టి పెరిగినప్పటినుండి పల్లెటూరు చూడకపోవడం నా దురదృష్టం అనిపించింది నాకు.

ముగ్గురం ఆడిటోరియం నుండి బయటకు వచ్చాం. ఏదో కొత్త లోకాన్ని చూసి బయటకొచ్చిన అనుభూతి కలిగింది నాకు. ఫోక్ కల్చర్ సార్ ప్రతాప్ రావుగారు. ముగ్గురం అతని దగ్గరకు వెళ్లాం.

''ఎలా ఉంది సార్?'' అడిగాడు.

''చాలా బావుంది'' ముగ్గురం ఒకేసారి చెప్పాం.

''ఇక్కడ బావుంది... బాగా లేదు... అని కాదు.. ఎక్కడో అమెరికాలో పుట్టి పెరిగిన వాళ్ళు మన సాంస్కృతిక అంశాలను మనకు చూపిస్తుంటే..!?! మనం చూడడం ఎంత విడ్డూరం?'' గొంతులో విచారం వ్యక్తమవుతోంది.

''మన ఆటలు పోయాయి. మనవి కాని ఆటల్లో దేశాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే స్థాయికి ఎదిగాం. వృత్తులు పోయాయి. ఉమ్మడి కుటుంబాలు పోయాయి. ఆఖరుకు కుటుంబ వ్యవస్థ కూడా ఛిన్నాభిన్నమవుతూ వ్యక్తి జీవితాలూ... వైయక్తిక వాదాలు ముందు కొస్తున్నాయి. మానవ సంబంధాలనే ఆ ఆధునిక... అత్యాధునిక వ్యవస్థ నాశనం చేస్తుంది... ఇప్పుడు ఏ తల్లీ పిల్లలకు చందమామను చూపి గోరుముద్దలు తినిపిస్తుంది?! ఏ తల్లికి జోలపాటలు వచ్చు. తన పసిబిడ్డను నిద్రపుచ్చడానికి!? ఏ తండ్రి తన పిల్లలతో ఆనందంగా గడవడానికి సమయాన్నికేటాయిస్తున్నాడు? చైల్డ్ హోమ్‌లు, ఓల్డేజ్ హోమ్‌లు... నిజం... పునాదులు కూలిపోతున్నాయ్''

సార్ అంత ఆవేశంగా మాట్లాడటం వెనుక ఎంత బాధ నిక్షిప్తమై వుందో...!!?

***

ఫ్యాను తిరుగుతూనే ఉంది... నా ఆలోచనలూ తిరుగుతూనే ఉన్నాయి. స్విచ్ ఆపేస్తే ఫ్యాను ఆగిపోతుంది. నా ఆలోచనలు ఆగిపోవాలంటే...!? ఏం చేయాలి!? సార్ చెప్పింది నిజమే. మా తరాల సాక్షిగా పునాదులు కూలిపోతున్నాయ్... కూలిపోతూనే వున్నాయి.

''ప్లీజ్ మధు...ప్లీజ్... నన్నేం చెయ్యొద్దు? ప్లీజ్... నన్నేం చెయ్యొద్దు'' చెల్లెలు నిద్రలో అరుస్తోంది.

దగ్గరికెళ్ళి లేపాను.. కంగారుగా లేచింది. చుట్టూ చూస్తోంది. ముఖమంతా చెమటలు పట్టి ఉన్నాయి.

''అన్నయ్యా... అన్నయ్యా'' అంది.

''నేనే...'' అన్నా.

నేను తాగగా మిగిలిన నీళ్లు ఇచ్చాను. కొద్దిగా తాగింది. 'ముఖమంతా తుడుచుకో' అంటే... బెడ్‌షీట్‌తో తుడుచుకుంది.

''ఏమైంది...?'' అడిగాను.

''కలలో నా ఫ్రెండొకడు మీద పడ్డాడు.... బలవంతంగా నన్ను .. నన్ను...'' కంగారు పూర్తిగా తగ్గినట్లు లేదు.

మరలా ఇంకోసారి నీళ్లు ఇచ్చాను. తాగింది.

కొంత ఊరట తీసుకుంది.

''పీడకల ... మధు అని నా బాయ్‌ఫ్రెండొకడు ఉన్నాడు... వాడు నాకు చాలా క్లోజ్. నన్ను బలవంతంగా రేప్ చేయబోయాడు. ఎంత వారిస్తున్నా వినడం లేదు... నా బట్టలు చించడానికి ప్రయత్నిస్తున్నాడు. నిన్ను వదలను... నిన్ను మాత్రం... వదలను... వదలను.... అంటూ మీద పడ్డాడు'' భయభయంగా చెప్పింది.

స్నేహితుడు... క్లోజ్‌ఫ్రెండ్... బలవంతం చేస్తూ కలరావడం ఏంటి? అర్థం కాలేదు నాకు.

''మీ ఇద్దరి మధ్యా రెండు మూడు రోజుల నుండి ఏమైనా గొడవలు జరిగాయా?'' అడిగాను.

''గొడవలేం జరగలేదు. కానీ... మధు ఫ్రెండొకడున్నాడు. శ్రీరామ్ అని... అతనికి నేనంటే చాలా ఇష్టమట. చాలా కాలం నుండి నాకు దగ్గరవ్వాలని ప్రయత్నం కూడా చేస్తున్నాడట... నేనే గుర్తించలేదు. మొన్న పార్కుకు వెళ్లినప్పుడు చెప్పాడు. ఈ రెండ్రోజుల నుండి శ్రీరామ్‌తో ఎక్కువ మాట్లాడటం... శ్రీరామ్‌తోనే ఎక్కువ టైం స్పెండ్ చేస్తున్నాను.

మధుకు కోపం వచ్చింది. అయితే ఈ రోజు మధును ఆటపట్టించాలని శ్రీరామ్‌కు ఐలవ్‌యు అని మెయిల్ పంపాను''

చెల్లెలు చెప్పిన మాటలు విన్న తర్వాత కొంతసేపు నేను ఏమీ మాట్లాడలేకపోయాను. ఏమీ మాట్లాడాలో కూడా నాకు తెలియలేదు.

''మధు అంటే నీ కిష్టమా!? అతన్ని నువ్వేమన్నా ప్రేమించావా? అని అడిగాను.

''అలాంటిది ఏమీ లేదు... కొంతకాలం మధుతో క్లోజ్‌గా ఉన్నాను కదా!! ఇప్పుడు శ్రీరామ్‌తో ఉండాలనుకుంటున్నాను'' మామూలుగా చెప్పింది తను.

''ఈవిధంగా మెయిల్స్ ఇవ్వడం మంచిది కాదు. అలా నువ్వు ఉండటం వలన ఒకరికి తెలియకుండా మరొకరికి నీమీద కోపం ఏర్పడుతుంది. రేపు జోక్‌కే శ్రీరామ్‌కు మెయిల్ పంపానని మధుకు చెప్పు ఇప్పుడు మాత్రం ఇవన్నీ ఆలోచించకుండా పడుకో'' అని మాత్రం చెప్పగలిగాను.

నా బెడ్ మీదకొచ్చి పడుకున్నాను. చెల్లి కూడా పడుకుంది. ఏం ఆలోచిస్తుందో తెలియదు... తన ఆలోచనలు ఎలా ఉంటాయో అనే ఊహించలేదు... ఊహించాలంటే భయం కాదు... ఏదో తెలియని బాధ... భరించరాని బాధ...

ప్రేమలు, స్నేహాలు.... వీటికీ విలువలు పోయాయా...?!? ఆలోచించాలి... తర్కించుకోవాలి. నా చెల్లికి తర్వాతైనా నేను ఏం చెప్పాలి?! ప్రశ్నలు... ప్రశ్నలు...

సార్ చెప్పిన మాటలు నా నుండి దూరం కావడం లేదు. మరీ మరీ దగ్గరవుతున్నాయి. దగ్గరవుతూనే ఉన్నాయి. పునాదులు కూలుతున్నాయి. కూలుతున్న వాటిలో నేనూ ఉన్నాను.. మా చెల్లెలుది. మా అమ్మా నాన్న ఉన్నారు. మా కుటుంబమే ఉంది. మా కుటుంబం లాంటి కుటుంబాలు ఎన్నో ఉన్నాయ్!?

మానవీయ విలువలు పోయిన తర్వాత ఈ డబ్బుతో... ఈ స్టేటస్‌తో వీళ్ల చావబోయే లోపు ఏం సాధిస్తారో ఆలోచించాలి... ఆలోచించాలి.

ఆనందాన్ని డబ్బులో కాదు హృదయంలో వెదుక్కోమని వీళ్లకి చెప్పాలి... ఒక మనిషి మరొక మనిషికి మానసికంగా దగ్గరవడంలో సంతోషాన్ని వెదుక్కోమని వీళ్లకి తెలియజేయాలి.

ఈ అర్థరాత్రి... ఆలోచిస్తున్నాను... కోల్పోయిన వాటిని పోగెయ్యడానికి నేనేం చెయ్యాలా అని... నిద్రకు దూరమై... ఒంటరినై నాలాంటి ఒంటరి వాళ్లు ఎంతమంది ఉంటారూ అని... వాళ్లిద్దరూ ఇలానే ఆలోచించాలీ అని...

★